క్లుప్తంగా

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు



పాన్‌గల్: వైద్యుల సూచనల మేరకు చిన్నారులకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూపర్‌వైజర్ సుమనశ్రీ అన్నారు. శనివారం మండలంలోని శాగాపూర్‌లో బాలింతలు, చిన్నారులను వైద్య సిబ్బందితో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో అందుతున్న వైద్య సేవలు, తీసుకోవాల్సిన పౌష్టికాహారం, చిన్నారులకు టీకాలు, జాగ్రత్తలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఐరన్, కాల్షియం మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సుమిత్ర, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు



ఆత్మకూర్: అక్రమంగా ఇసుక తరలిస్తే కఠినమైన చర్యలు తప్పవని తహసీల్దార్ రాజు, ఎస్‌ఐ నరేందర్ స్పష్టం చేశారు. శనివారం మండలంలోని రేచింతల, తిప్పుడంపల్లి ఊకచెట్టు వాగులను పరిశీలిచారు. కొంతమంది ప్రభుత్వ పనుల కోసమని అనుమతులు లేకుండానే ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు తమకు సమాచారం అందుతుందని అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే పూర్తి అనుమతులు పొందిన అనంతరమే ఇసుకను తరలించాలని, లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈసందర్భంగా అనుమతులు లేకుండా మొరం మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని రూ.వెయ్యి చొప్పున జరిమానాలు విధించినట్లు తెలిపారు.

అధ్యాపకుడి ఔదార్యం



ఆత్మకూర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఎంసెట్, స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేసి అధ్యాపకుడు కురుమూర్తి ఔదార్యాన్ని చాటుకున్నారు. శనివారం ఇంగ్లిష్ సబ్జెక్టు అధ్యాపకుడు కురుమూర్తి తన సొంత నిధులతో ప్రభుత్వ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించే విధంగా ప్రోత్సహిస్తూ ఎంసెట్, స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాలను అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కురుమూర్తిని ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రావు, అధ్యాపకులు, స్థానికులు అభినందించారు.

వనపర్తి టౌన్ 2వ ఎస్‌ఐగా రామరాజు



పెబ్బేరు రూరల్: వనపర్తి టౌన్ 2వ ఎస్‌ఐగా రామరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రక్షిత కే మూర్తిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ సమస్య పరిష్కరించే దిశగా బాధితులకు భరోసా ఇవ్వాలని ఎస్పీ సూచించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను వేగంగా పూర్తి చేయాలన్నారు.

క్రీడా స్ఫూర్తితో లక్ష్యం చేరుకోవాలి



పెబ్బేరు రూరల్: విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో లక్ష్యాన్ని నెరవేర్చుకోవాలి ఎస్‌ఐ హరిప్రసాద్ రెడ్డి అన్నారు. ఆయన శనివారం పట్టణ కేంద్రంలోని మాంటిస్సోరి పాఠశాలను సందర్శించి రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన పాఠశాల విద్యార్థినులు రిషిత, అశ్వనికి ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలోని మల్లారెడ్డిగూడెం మండలం చింతలపాలెంలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొన్న రిషిత, అశ్విని జిల్లాకు పేరు తెచ్చారన్నారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ రాజేంద్ర గౌడ్, పీఈటీ మహేష్ ,ఉపాధ్యాయులు బృందం పాల్గొన్నారు.

అమ్మవారికి కుంకుమార్చన

వనపర్తి టౌన్: భక్తిశ్రద్ధలతో శనివారం జిల్లా కేంద్రంలోని చౌడేశ్వరి ఆలయానికి భక్తులు పోటెత్తారు. పౌర్ణమిని పురస్కరించుకొని అమ్మవారిని అభయ హస్తంతో కూడిన దుర్గాదేవి రూపంలో దర్శించుకున్నారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించడంతో పాటుగా అమ్మవారికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేకంగా నిర్వహించిన కుంకుమార్చనలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. కుంకుమార్చనను భక్తులందరూ ప్రసాదంగా స్వీకరించి, సౌభాగ్యప్రాప్తి కలిగించాలని దేవిని ప్రార్థించారు. ప్రతి పౌర్ణమికి వనపర్తిలో భక్తిభావం పెంపొందించేందుకు ఆలయంలో విశేషంగా పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు రంగం ఆంజనేయులు, గౌరవ అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. అమ్మవారి నిజరూప దర్శనం మొదలుకొని దేదీప్యమానంగా దర్శనం ఇచ్చేంత వరకు భక్తులు అమ్మవారి స్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. అనంతరం భక్తులందరికీ అన్నసమర్పణ (అన్నదానం) కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు గోపాల్, హరి శంకర్, పూర్ శేఖర్, రామచంద్రయ్య, పవన్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



పిన్నంచర్లలో..

వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో గల శ్రీదత్తకోటిలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఆదిదంపతులైన శివపార్వతుల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. పెద్ద ఎత్తున హాజరైన భక్తుల మధ్య శివపార్వతుల కల్యాణం కనులపండువగా జరిగింది. శివపార్వతులకు అర్చకులు తలంబ్రాలు పోయగా ఆడపడులు అమ్మవారికి వడిబియ్యం పోశారు. ఆలయంలో జరుగుతున్న కల్యాణానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.

గిరిజా కల్యాణం

ఆత్మకూర్: మండలంలోని పిన్నంచర్లలో శివ దీక్షపరుల ఆధ్వర్యంలో శనివారం నందికోళ్లసేవ, అగ్నిగుండం, గిరిజాకల్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పూజ కార్యక్రమాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. పూజలు, కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.



వనపర్తిలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



కానాయపల్లిలో..

దివ్యఖురాన్ మానవాళికి మార్గదర్శకం

ఆత్మకూర్: దివ్య ఖురాన్ ప్రపంచ మానవాళికి మార్గదర్శకమని, ప్రతి ముస్లిం ఖురాన్ పఠనం చేయాలని హజ్రత్ మౌలానా అమీరుల్లాఖాన్ ఖాస్మీ, మౌలానా ముతిఉర్ రహ్మాన్, మౌలానా అస్లాం జావేద్, మౌలానా ఫక్రుద్దీన్, మౌలానా ఇలియాజ్ అన్నారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజామున వరకు పట్టణంలోని మక్తబ్ మదర్సా జియాఉల్ ఖురాన్ (అరబ్బీ పాఠశాల) వార్షికోత్సవం స్థానిక ఎంజీగార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహువలై వసల్లం సూక్తులను పాటించాలని, తల్లిదండ్రులను గౌరవించాలని, ప్రతినిత్యం ఐదు పూటలు నమాజ్ ఆచరించాలని సూచించారు. దాన, ధర్మాలు చేయాలని, ప్రతిఒక్కరితో గౌరవపూర్వకంగా మెలగాలని కోరారు. దివ్యఖురాన్‌ను చిన్న, పెద్ద అందరూ నేర్చుకోవాలని సూచించారు. అనంతరం ఇక్కడ దివ్యఖురాన్ పఠనం చదువుతున్న విద్యార్థులకు సన్మానించి ప్రపంచ శాంతి కోరుతూ ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హాఫీజ్ ఫక్రుద్దీన్, హఫీజ్ జియాఉర్ రహ్మాన్ ఫహీమ్, హాఫీజ్ ముక్తదీర్, హాఫీస్ రఫియోద్దీన్, మౌలానా అబ్దుల్‌అలీం రషాది ఇతరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న మౌలానా అమీరుల్లాఖాన్

చాలీచాలని వేతనాలతో కార్మికుల ఇబ్బందులు

అమరచింత: మిషన్ భగీరథ పథకంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు చాలిచాలనీ వేతనాలు, అవి కూడా సరిగా అందకపోవడంతో ఆర్థిక భారం తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని మిషన్ భగీరథ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి రఘు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం నల్గొండ జిల్లాలో మిషన్ భగీరథ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై శనివారం అమరచింత పంప్ హౌజ్ వద్ద కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు ప్రతి నెల కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నిత్యం వెట్టి చాకిరీ చేస్తున్న మిషన్ భగీరథ కార్మికులకు ప్రతి నెల రూ.పది వేలు ఇస్తూ వాటిలోనె ట్రావెలింగ్ అలవెన్స్ సరిపెట్టుకోవాలంటున్నారని వాపోయారు. ఇప్పటికైనా జీఓ నంబర్ 60ను మంజూరు చేసి కార్మికులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ కార్మికులు సత్యారెడ్డి, అశోక్, దేవదాస్, స్వామి, దేవరాజ్, శివ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న మిషన్ భగీరథ కార్మికులు

చిన్నారెడ్డి సేవలకు గుర్తింపు దక్కింది

సాక్షి, నెట్‌వర్క్: మాజీ మంత్రి చిన్నారెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా నియమించి కేబినెట్ హోదా కల్పించడం సంతోషకరమని టీపీసీసీ గీత కార్మిక సంఘం రాష్ట్ర చైర్మన్ కేశం.నాగరాజ్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నో ఉద్యమాలకు ముందుండి నడిపించిన చిన్నారెడ్డి అసెంబ్లీ టికెట్‌ను సైతం త్యాగం చేశారన్నారు. ఈమేరకు సీఎం కేసీఆర్ చిన్నారెడ్డి సేవలను గుర్తించి సముచిత స్థానం కల్పించారని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొంకి వెంకటేష్, మండల అధ్యక్షులు ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డి, రాములుయాదవ్, విజయ్‌కుమార్, జిల్లా దివ్యాంగుల సంఘం ఉపాధ్యక్షుడు గంజాయి రమేష్, మున్నూరు జయకర్ తదితరులు పాల్గొన్నారు.



పెబ్బేరులో బాణాసంచా కాల్చుతున్న కాంగ్రెస్ నాయకులు

ఘనంగా స్వయం పాలన దినోత్సవం



బుద్దారం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులైన విద్యార్థులు

పాన్‌గల్: మండలంలోని చింతకుంట ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి స్వయం పాలన దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌గా జయశ్రీ, డీఈఓగా తిరుపతి, హెచ్‌ఎంగా శివకుమార్ పాటు 20 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. విద్యార్థి ఉపాధ్యాయుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదో తరగతి చదువుతున్న పుష్ప మండల విద్యాశాఖ అధికారిగా, ప్రధానోపాధ్యాయుడిగా శ్రీవర్ధన్, ఇరవై మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. ముగ్గురు వ్యాయామ ఉపాధ్యాయులుగా, ముగ్గురు స్వీపర్లుగా వ్యవహరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పుల్లయ్య బహుమతులు ప్రదానం చేశారు.

పెబ్బేరు రూరల్: మండలంలోని రంగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు నైపుణ్యాలు ప్రదర్శించి, తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. బోధనలో చక్కని ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హెచ్‌ఎం జయరాములు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయకుమార్, వేణాచారి, భాస్కర్, గోవర్ధన్‌రెడ్డి, రాంప్రసాద్, రాజశేఖర్‌గౌడ్, నరేందర్ గౌడ్, మల్లికార్జున్, నాగన్న, వరలక్ష్మి, ఇందిర పాల్గొన్నారు.

వీపనగండ్ల: మండలంలోని పలు పాఠశాలల్లో శనివారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కల్వరాల పాఠశాలలోని ఉన్నత పాఠశాలలో 25 మంది విద్యార్థులు, తూంకుంట ప్రాథమిక పాఠశాలలో 19 మంది విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, శిరీష, ఉపాధ్యాయులు భాస్కర్, రాజు, కృష్ణవేణి, చంద్రశేఖర్, క్రాంతికుమార్, అరుణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోపై అవగాహన

మదనాపురం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శనివారం ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలకు పల్స్ పోలియోపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారి భవానీ మాట్లాడుతూ మార్చి 3, 4, 5వ తేదీల్లో నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అన్ని గ్రామాల్లో ఐదేళ్ల లోపు పిల్లలకు అందరికీ ఈ పోలియో చుక్కలు వేయించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ప్రమీల పాల్గొన్నారు.

గట్టుకాడిపల్లి ఆలయంలో పూజలు



ఖిల్లాఘనపురం: మండలంలోని గట్టుకాడిపల్లిలో జరుగుతున్న శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఉత్సవాలకు శనివారం మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పండితులతో మాట్లాడుతూ ఆలయంలో జరుగుతున్న ఉత్సవాలు, చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కృష్ణానాయక్, నాయకులు రమేస్, దేవేందర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

29న విశ్వకర్మ యోజనపై సదస్సు

వనపర్తి: సంప్రదాయ చేతివృత్తులు, హస్త కళాకారులను అన్నివిధాలుగా ప్రోత్సహిస్తూ, వారి నైపుణ్యాలను పెంపొందించి ఆర్థికంగా బలోపేతం చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం గురించి ఈనెల 29న అవగాహన కల్పిస్తున్నట్లు ఎంఎస్‌ఎంఈ ఏడీ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

పాన్‌గల్: ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ కోటేశ్వర్ అన్నారు. శనివారం మండలంలోని అన్నారం, బహుదూర్‌గూడెం, బండపల్లి గ్రామాల్లో పర్యటించి ఉపాధి పనులు, నర్సరీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాలల్లో వసతులను ఆయన పరిశీలించారు.

సంత్ రవిదాస్‌కు నివాళి

వనపర్తి టౌన్: సంత్ రవిదాస్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో కట్టెమ్మ గుడి ఎదుట ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజారామ్‌ప్రకాశ్, నరసింహాశర్మ, నాగరాజు, గంధం గట్టయ్య, కొండన్న, గోర్ల మన్యం, గంధం ఆంజనేయులు, గంధం ప్రభాకర్, ద్యారపోగు మన్యం తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం సమీపంలో చిరుతల సంచారం

ఖిల్లాఘనపురం: మండల కేంద్రానికి సమీపంలోని గుట్టల్లో ఓ గుండుపై శనివారం రెండు చిరుతలు కూర్చొని ఉన్నట్లు ప్రత్యక్షంగా చూసిన గ్రామస్తులు తెలిపారు. రెండు నెలలుగా గుట్టల్లో కనిపించిన చిరుతలు శనివారం మండల కేంద్రంలోని ఫారెస్టు నూతన భవనం సమీపంలోకి రావడంతో గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలం నుంచి మామిడిమాడ, పర్వతాపురం, అప్పారెడ్డిపల్లి గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న గుట్ట నుంచి దీపం పెట్టే గుండు వరకు నడుచుకుంటూ వెళ్లిందని తెలిసిన ప్రయాణికులు ఆ దారి వెంట వెళ్లాలంటేనే వణుకుతున్నారు. ఫారెస్టు అధికారులు వేగంగా స్పందించి చిరుతలను పట్టుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి ఇబ్బందులు రానివ్వొద్దు



ట్యాంకును పరిశీలిస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

పాన్‌గల్: వేసవికాలం దృష్ట్యా తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంఈఓ, జీపీ ప్రత్యేకాధికారి లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శనివారం మండలంలోని కేతేపల్లిలో పర్యటించి తాగునీటి పైపులైన్లు, ట్యాంకులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైన లీకేజీలు ఉంటే వాటిని సరిచేసి తాగునీటి కొరత లేకుండా చూడాలని ఆయన సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలన

గ్రామంలోని భగత్‌సింగ్‌నగర్ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుశాతం, విద్యార్థుల సామర్థ్యాలను, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యతగా భోజనం అందించాలన్నారు.

కాలుష్య నియంత్రణకు కృషి

ఆత్మకూర్: ప్లాస్టిక్ వాడకం వల్ల ఎన్నోరకాల అనర్థాలు దారి తీస్తాయని, పర్యావరణం పూర్తిగా దెబ్బతింటుందని జీహెచ్‌ఎం కొండాపురం బాలరాజు అన్నారు. శనివారం బాలికల ఉన్నత పాఠశాలలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కకల్పించారు. సమ్మక్క, సారక్క జాతరకు వెళ్తున్న భక్తులు ప్లాస్టిక్‌ను వినియోగించకుండ విద్యార్థులు తమ గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునిత, జమునరాణి, పద్మజారాణి, శ్వేత, విద్యార్థులు పాల్గొన్నారు.

మదనాపురం: రాష్ట్రంలో ప్రముఖంగా జరుగుతున్న సమ్మక్క సారక్క జాతరలో ప్రజలు ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని కోరుతూ విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ స్పృహ కలిగి ఉండాలని జెడ్పీహెచ్‌ఎస్, మదనాపురం విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు జెడ్పీ చైర్మన్‌గా కలెక్టర్, పర్యాటక శాఖ మంత్రి, ఇతర మంత్రులుగా, ఎమ్మెల్యేలు, ఎంపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలు వ్యవహరించి స్థానికులకు పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకత వివరించారు.



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

మిషన్ భగీరథ పేరుతో రహదారిపై తవ్వకాలు



ప్రధాన రహదారిపై మిషన్‌భగీరథ పైప్‌లైన్ కోసం గుంతలు తవ్వుతున్న కూలీలు

అమరచింత: పట్టణంలోని ప్రధాన రహదారిపై రెండు రోజుల నుంచి మిషన్ భగీరథ పైప్‌లైన్ గుర్తించేందుకు రహదారి పొడవునా గుంతలు తవ్వుతున్నారు. వీటిని ఎందుకు తవ్వుతున్నారని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తే మిషన్ భగీరథ పైప్‌లైన్ గుర్తించేందుకని సమాధానం ఇస్తున్నారు. ఈవిషయాన్ని మున్సిపల్ అధికారులకు అడిగినా.. తమకు సైతం సమాచారం లేదని చెప్పడం వింతగా ఉంది. పట్టణంలోని ఆయా వార్డులకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందించేందుకు ఆయా వార్డుల్లో పైప్‌లైన్లు ఏర్పాటు చేసి ఇంటింటికీ కుళాయిలను సైతం అమర్చారు. కానీ ఇప్పటి వరకు ఇంట్రా ద్వారా ఆయా వార్డులకు మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో ఇంటి ముందున్న కుళాయిలు దిష్టిబొమ్మలుగా దర్శనమిస్తున్నాయి. పట్టణంలో తాగునీటి వ్యవస్థను పూర్తి స్థాయిలో అందించామని, వాటి నిర్వహణ బాధ్యతలను మున్సిపాలిటీకి అప్పగించిన తర్వాత ఇంట్రా ఇలా మరోమారు ఎందుకు నీటి పేరుతో గుంతలు తవ్వుతుందో అర్థం కావడం లేదని ఆయా వార్డుల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తుస్తున్నారు. పట్టణంలో మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను గుర్తిస్తున్నామని గుంతలను తవ్వుతున్నా.. మున్సిపల్ ఏఈకి సైతం సమాచారం లేకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. దీనిపై అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

పెబ్బేరు రూరల్: ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు ఇంటర్ వార్షిక పరీక్షలలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చదవాలని జిల్లా వసతి గృహ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసులు అన్నారు. జిల్లా కేంద్రంలోని నాగవరం ప్రభుత్వ బీసీ కళాశాల బాలుర వసతి గృహాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులు ఏఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారో గుర్తించి ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వసతి గృహ పరిసరాలను, వంటగదిని ఆహార పదార్థాలను పరిశీలించారు. కార్యక్రమంలో వసతి గృహసంక్షేమ అధికారి ఆంజనేయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారి శ్రీనివాసులు

బాలల హక్కులపై అవగాహన



ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న డీసీపీయూ సోషల్ వర్కర్ నరేందర్

పాన్‌గల్: వెంగళాయిపల్లిలో బాల్య వివాహాల నిరోధం, బాలల హక్కులపై మహిళా శిశుసంక్షేమ శాఖ, బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో శనివారం ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలల పరిరక్షణ విభాగం డీసీపీయూ సోషల్ వర్కర్ నరేందర్ మాట్లాడుతూ బాలికలను బాలురతో సమానంగా చదివించాలని, వారిపై వివక్ష చూపకూడదని కోరారు. బాలలు, బాలల హక్కులు, బాల్య వివాహాల నిషేధ చట్టం 2006, పోక్సో చట్టం 2012, ఆడపిల్లల విద్య యొక్క ప్రాముఖ్యత, తల్లిదండ్రుల పాత్ర, చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్లు 1098, 112, 100 అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ నాగిరెడ్డి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

జీపీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

ఖిల్లాఘనపురం: గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయడంతో పాటు మున్సిపాలిటీ కార్మికులకు అందించే వేతనాలు ఇవ్వాలని సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్టా ఆంజనేయులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో తెలంగాణ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ అనుబంధం సంఘం ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు శ్రీనివాసులు అధ్యక్షతన విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. పంచాయతీ వర్కర్స్ యూనియన్‌లోని 100 మంది కార్మికులు సీఐటీయూ యూనియన్‌లో చేరారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దాసు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, కోశాధికారిగా పర్వతాపురం శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా బద్రు, శేఖర్, విజయలక్ష్మి, సహాయ కార్యదర్శులుగా కొండ బాలయ్య, వెంకటేష్, నాగేష్‌తో పాటుగా 18 మంది కమిటీ సభ్యులను నియమించారు.